క్లుప్తంగా

కొలనుభారతి దేవిని దర్శించుకున్న కర్నూలు జడ్జి


కొలనుభారతి అమ్మవారిని దర్శించుకుంటున్న కర్నూలు జడ్జి

కొత్తపల్లి: మండలంలోని పుణ్య క్షేత్రమైన కొలను భారతి దేవి ఆలయాన్ని కర్నూలు జిల్లా పోక్సో జడ్జి లక్ష్మీరాజ్యం శనివారం దర్శించుకున్నారు. ఆలయానికి చేరుకున్న ఆమెకు ఆలయ ప్రధాన అర్చకుడు శ్రీనివాసశర్మ స్వాగతం పలికారు. సరస్వతి అమ్మవారికి ఆమె ప్రత్యేక పూజలు చేసుకున్నారు. ఆలయ పరిసరాల్లోని సప్తశివాలయాలను సందర్శించారు. అక్కడే ఉన్న ధారఘోషిని నదిని తిలకించి ఆలయ చరిత్ర తెలుసుకున్నారు. ఆధ్యాత్మికతకు కొలనుభారతి దేవి ఆలయం పుట్టినిల్లులా ఉందన్నారు. ఇంతటి పవిత్రత ఉన్న ఆలయాన్ని దర్శించుకోవడం ఎంతో ఆనందాన్ని ఇస్తుందన్నారు.

గృహ నిర్మాణాలు పూర్తి చేయండి


మాట్లాడుతున్న హౌసింగ్ ఏఈ మహేశ్వర్‌రెడ్డి

ఆత్మకూరు: పక్కాగృహాల నిర్మాణాలు త్వరగా పూర్తి చేసుకోవాలని మండల హౌసింగ్ ఏఈ ఉమామహేశ్వర్‌రెడ్డి లబ్ధిదారులకు సూచించారు. శనివారం ఆయన హౌసింగ్ కార్యాలయంలో సిబ్బందితో సమావేశమయ్యారు. గృహ నిర్మాణాల లబ్ధిదారులకు ప్రభుత్వం అదనపు సాయం అందజేస్తుందన్నారు. బీసీ లబ్ధిదారులకు రూ.50 వేలు, ఎస్సీలకు రూ.75 వేలు, చెంచులకు రూ.లక్ష వరకు అందజేస్తుందన్నారు. ఈ విషయాన్ని లబ్ధిదారుల దృష్టికి తీసుకెళ్లి త్వరగా గృహాలు నిర్మించుకునేలా చూడాలని ఆయన ఆదేశించారు.

సంజీవరాయుడికి ప్రత్యేక పూజలు



నందికొట్కూరు: రోళ్లపాడు అభయారణ్యంలో వెలసిన బరక సంజీవరాయ స్వామికి అమావాస్య సందర్భంగా శనివారం భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. భారతీయ సంస్కృతి విశిష్టమైనదని, హనుమాన్ చాలీసా పారాయణం, నవ వ్యాకరణ గ్రంథాలు చదవాలని ఆలయ అర్చలు భక్తులకు సూచించారు.

చలివేంద్రం ఏర్పాటు


చలివేంద్రాన్ని ప్రారంభించిన జెడ్పీటీసీ పుల్యాల దివ్య

పగిడ్యాల: స్థానిక బస్టాండు ఆవరణంలో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని శనివారం జెడ్పీటీసీ పుల్యాల దివ్య, సర్పంచ్ పెరుమాళ్ల శేషన్న ప్రారంభించారు. చలివేంద్రాన్ని ప్రయాణికులు, వ్యవసాయ కూలీలు, రైతులు సద్వినియోగం చేసుకోవాలని వారు సూచించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి ఉపేంద్రారెడ్డి పాల్గొన్నారు.

ముందస్తు ఉగాది సంబరాలు


సంబరాల్లో విద్యార్థులు, ఉపాధ్యాయులు

పగిడ్యాల: విశ్వావసు నామ సంవత్సర చైత్ర శుద్ధ తదియ ఉగాదిని పురస్కరించుకుని నెహ్రూనగర్ మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల విద్యార్థులు శనివారం ముందస్తు సంబరాలు నిర్వహించారు. పాఠశాల విద్యార్థులు సంప్రదాయ వస్త్రధారణతో హాజరయ్యారు. పాఠశాల తరగతి గదిని మామిడి తోరణాలతో అలంకరించి షడ్రుచుల ఫ్లకార్డులను ప్రదర్శించారు. హెచ్‌ఎం జరీనా, ఉపాధ్యాయురాలు చిన్న పద్మమ్మ ఉగాది విశిష్టతను తరించారు.

నాటుసారా స్థావరాలపై దాడులు

ఆత్మకూరు: శ్రీశైలం పరిధిలోని వెలుగుబంటి శిలా, మామిడి శిలాలో నాటుసారా స్థావరాలపై శనివారం దాడులు నిర్వహించి 2,400 లీటర్ల బెల్లం ఊటను ధ్వంసం చేసినట్లు ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ సీఐ కిషోర్‌కుమార్ తెలిపారు. శ్రీశైలం దేవస్థానం పరిసర ప్రాంతాల్లోని మాణిక్యేశ్వరమఠం, కొత్తపేట ప్రాంతాల్లో నాటుసారా విక్రయిస్తున్న ఇద్దరిపై కేసులు నమోదు చేసి వారి వద్ద నుంచి 10 లీటర్ల నాటుసారాను స్వాధీనం చేసుకున్నామన్నారు. దాడుల్లో ఎస్‌ఐలు, జగదీష్, డీటీఎఫ్ ఎస్‌ఐ రమేష్, కోయిలకుంట్ల ఎస్‌ఐ సందీప్, నందికొట్కూరు ఎస్‌ఐ జబ్రుల్లా, ప్రవీణ్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

శనగ రైతుకు ‘మద్దతు’ ఏదీ?

- ధర లేక అల్లాడుతున్న అన్నదాత
- తెరుచుకోని కొనుగోలు కేంద్రాలు
- దళారుల చేతిలో దగాపడుతున్న రైతన్నలు
- పట్టించుకోని ప్రభుత్వం

శనగ రైతులకు మద్దతు ధర దక్కడం లేదు. మరోవైపు బహిరంగ మార్కెట్‌లో ధరలు పూర్తిగా పడిపోయాయి. ప్రభుత్వం మాత్రం కొనుగోలు కేంద్రాలు ప్రారంభించకపోవడంతో దళారులు దిగుబడులను తక్కువ ధరకే అడుగుతున్నారు. తక్కువ ధరకు ఇవ్వలేక.. దిగుబడులను నిల్వ చేసుకోలేక అన్నదాతలు సతమతవుతున్నా ప్రభుత్వం పట్టించుకోవడం లేదు.



తెరుచుకోని కొనుగోలు కేంద్రం


శనగ పంట

నందికొట్కూరు: శనగ రైతులు సంక్షోభంలో చిక్కుకుని విలవిల్లాడుతున్నారు. రోజురోజుకు దిగజారుతున్న ధరలతో లబోదిబోమంటున్నారు. బహిరంగ మార్కెట్‌లో ఉన్న ధరకు దిగుబడులను విక్రయించుకుంటే కనీసం పెట్టుబడి కూడా వచ్చే పరిస్థితి లేదు. మూలిగే నక్కపై తాటి పండు పడినట్లు కేంద్ర ప్రభుత్వం శనగల దిగుబడులపై సుంకాన్ని ఎత్తివేసి నిలువునా ముంచేసింది. మరోవైపు రాష్ట్ర ప్రభుత్వం మద్దతు ధరతో దిగుబడులు కొనుగోలు చేసేందుకు కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయకపోవడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. నియోజవర్గంలోని జూపాడుబంగ్లా మండలంలో 3,500 హెక్టార్లు, పగిడ్యాల 2,500, పాములపాడు 1,000, మిడుతూరు 5,500, నందికొట్కూరు 4,500, కొత్తపల్లి మండలంలో 250 హెక్టార్లలో శనగ పంటను రైతులు సాగు చేశారు. గత ప్రభుత్వంలో క్వింటా రూ.7,500 వరకు ధర ఉండేది. ప్రస్తుతం రూ.5 వేలు కూడా పలకడం లేదు. కేంద్ర ప్రభుత్వం క్వింటా రూ.5,650 మద్దతు ధర కల్పించినా రాష్ట్ర ప్రభుత్వం ఇంతవరకు కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయలేదు. ఎప్పుడు ఏర్పాటు చేస్తుందో కూడా తెలియకపోవడంతో అన్నదాత తీవ్ర మనోవేదనతో కుమిలిపోతున్నారు.

కొనుగోలు కేంద్రాలు సిద్ధం

కేంద్ర ప్రభుత్వం రూ.5,650 మద్దతు ధర ప్రకటించింది. శనగ కొనుగోలు కేంద్రాలను సిద్ధం చేశాం. రైతులెవరూ దళారులకు దిగుబడులు విక్రయించొద్దు. ప్రభుత్వం నుంచి ఆదేశాలు రాగానే కొనుగోళ్లు ప్రారంభిస్తాం.
– విజయశేఖర్ ఏడీప

కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాలి



ఐదెకరాల్లో శనగ సాగు చేశాను. ఎకరాకు రూ.30 వేల వరకు ఖర్చు వచ్చింది. శనగ పంట కోతలు పూర్తయి రెండు నెలలు కావస్తోంది. అప్పు ఇచ్చిన వాళ్లు చెల్లించాలని ఒత్తిడి చేస్తున్నారు. అమ్ముకుందామంటే బహిరంగ మార్కెట్‌లో ధర పూర్తిగా తగ్గిపోయింది. కనీసం మద్దతు ధరకైనా అమ్ముకుందామంటే ఇంతవరకు ప్రభుత్వం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయలేదు. ఏం చేయాలో దిక్కుతోచడం లేదు.
– నాగభూషణంరెడ్డి 10 బొల్లవరం రైతు

మద్దతు ధరతో కొనాలి



ఎకరాకు 3 నుంచి 4 క్వింటాళ్ల పంట దిగుబడి వచ్చింది. మార్కెట్‌లో ధర రోజురోజుకు తగ్గుతోంది. దళారులు కుమ్మక్కై కింటా రూ.5 వేల లోపే అడుగుతున్నారు. అంతకు అమ్ముకుంటే పెట్టుబడులు కూడా రావు. ప్రభుత్వం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి మద్దతు ధరతో కొనుగోలు చేయాలి.
– జయరాం కొక్కెరంచ గ్రామం, కొత్తపల్లి మండలం

పండుగ దినాల్లో విద్యుత్ బిల్లులు చెల్లించవచ్చు

జూపాడుబంగ్లా: ఈనెల 30, 31 తేదీల్లో ఉగాది, రంజాన్ పండుగలున్నప్పటికీ విద్యుత్ బిల్లుల వసూలు కేంద్రాలు తెరచి ఉంటాయని ట్రాన్స్‌కో డీఈ శ్రీనివాసులు శనివారం తెలిపారు. నందికొట్కూరు, పగిడ్యాల, జూపాడుబంగ్లా, మిడుతూరు మండలాల్లో గృహ, వ్యవసాయ విద్యుత్ వినియోగదారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

హెల్మెట్ వాడకంపై అవగాహన

బండిఆత్మకూరు: స్థానిక చర్చి వద్ద హెల్మెట్ వాడకంపై ద్విచక్రవాహనదారులకు ఎస్‌ఐ జగన్‌మోహన్ అవగాహన కల్పించారు. రోడ్డుప్రమాదాల్లో ఎక్కువగా తలకు గాయాలై యువత మృతిచెందుతున్నారన్నారు. హెల్మెట్ ధరిస్తే ప్రాణాపాయం తప్పే అవకాశం ఉందన్నారు.

- పాములపాడు: ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని హెడ్‌కానిస్టేబుల్‌అల్లబకాష్ సూచించారు. శనివారం బస్టాండ్ సెంటరులో ఆటో డ్రైవర్లు, ప్రజకు రోడ్ సేఫ్టీపై అవగాహన కల్పించారు.

ధోబీఘాట్లు మంజూరు చేయించండి

జూపాడుబంగ్లా: ధోబీఘాట్లు నిర్మించి రజకులను ఆదుకోవాలని రజక సంక్షేమ సంఘం మండల అధ్యక్షుడు రామాంజనేయులు, ప్రధాన కార్యదర్శి రవికుమార్ కోరారు. శనివారం వారు ఏపీ రజక కార్పొరేషన్ చైర్‌పర్సన్ సావిత్రిని కలిసి వినతిపత్రం అందజేశారు.

వీఓఏలను తొలగించడం తగదు


ధర్నా చేస్తున్న నాయకులు, వీఓఏలు

నందికొట్కూరు: వీఓఏలను అన్యాయంగా తొలగించడం తగదని సీఐటీయూ జిల్లా అధ్యక్షులు ఏసురత్నం విమర్శించారు. బాధిత వీఓఏలతో కలిసి సీఐటీయూ ఆధ్వర్యంలో ఆయన శనివారం మండల పరిషత్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఏసురత్నం మాట్లాడుతూ మల్యాల గ్రామంలో ఎలాంటి అవినీతి, అక్రమాలకు పాల్పడకుండా నిజాయితీగా పని చేసిన వీఓఏలు శ్రీరాములు, దూదేకుల షఫీలను ఎలా తొలగిస్తారని నిలదీశారు. గ్రామ సభలు ఏర్పాటు చేయకుండా, ఐక్య సంఘాల తీర్మానాలు లేకుండా ఏపీఎం శ్రీనివాసులు అధికార పార్టీ నాయకుల మాటలు విని తొలగించడం దుర్మార్గమన్నారు. తొలగించిన వీఓఏలను విధుల్లోకి తీసుకోవాలని, లేని పక్షంలో నిరాహార దీక్షలు చేపడతామని హెచ్చరించారు. అనంతరం ఎంపీడీఓకు వినతి పత్రం అందజేశారు. ధర్నాలో సీపీఎం నాయకులు నాగేశ్వరరావు, ఫక్కీర్‌సాహెబ్, గోపాలకృష్ణ, వీఓఏల సంఘం నాయకులు రమణ, సతీష్, జయమ్మ, ఏసేరమ్మ, మూర్తుజావలి, సలీమాబీ, నజీమున్‌బీ, శకుంతలమ్మ,రమణమ్మ,ఫకిరమ్మ,సరోజమ్మ పాల్గొన్నారు.

మున్సిపాలిటీని అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తాం


మాట్లాడుతున్న ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర్‌రెడ్డి. చిత్రంలో మున్సిపల్ చైర్‌పర్సన్ ఆసియామారూఫ్

ఆత్మకూరు: ఆత్మకూరు మున్సిపాలిటీని అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తామని ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర్ రెడ్డి, మున్సిపల్ చైర్‌పర్సన్ ఆసియామారూఫ్ అన్నారు. మున్సిపల్ కార్యాలయంలో శనివారం మున్సిపల్ కౌన్సిలర్ల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంలో వారు మాట్లాడుతూ వేసవిలో తాగునీటి సమస్య రాకుండా చర్యలు తీసుకుంటున్నామన్నారు. అందులో భాగంగానే నాస్ అమృతం పథకం కింద రూ.139 కోట్లతో నాలుగు చోట్ల సమగ్ర తాగునీటి సరఫరా కోసం ట్యాంకర్లను ఏర్పాటు చేస్తున్నామన్నా రూ.3 కోట్లతో పలు కాలనీల్లో సీసీ రోడ్లు ఏర్పాటు చేస్తున్నామన్నారు. మున్సిపల్ కార్యాలయం ఏర్పాటుకు త్వరలో భూమిపూజ చేస్తామన్నారు. 125 పద్దుల కింద రూ.8,97,5,000తో ఈ యేడాది బడ్జెట్ ఏర్పాటు చేశామని, దీనికి వార్డు కౌన్సిలర్‌లు ఆమోదం తెలపాలని కోరారు. అంతకుముందు మున్సిపాలిటీ వేలం పాటలు, టెండర్ల ఖరారుతో పాటు రూ.3 లక్షలతో వివిధ కాలనీల్లో సీసీ రోడ్లు, రక్షిత మంచినీటి ట్యాంకర్ల నుంచి నీటి సరఫరా, నూతన శానిటేషన్ ఖర్చులు, బవనాసి వాగు వద్ద ధోబీఘాట్ ఏర్పాటు, 21 తీర్మానాల్లో ఒక్క తీర్మానం మినహా, మిగతా అన్నింటినీ సభ్యులు ఏకగ్రీవంగా ఆమోదించారు. కార్యక్రమంలో వార్డు కౌన్సిలర్ సభ్యులు విజయ్‌చౌదరి, గౌస్‌లాజం, హరి, ప్రకాష్‌రావు, బోయ లక్ష్మీదేవి, కో ఆప్షన్ సభ్యులు రషీద్, తిరుపమయ్య, మున్సిపల్ కమిషనర్ రమేష్‌బాబు పాల్గొన్నారు.

- ఆత్మకూరు పట్టణంలోని మూడుచోట్ల రక్షిత మంచినీటి ట్యాంకర్లను ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర్‌రెడ్డి, చైర్‌పర్సన్ ఆసియామారూఫ్ ప్రారంభించారు.

మహానంది బహిరంగ వేలాల్లో బాహాబాహీ

- మొదటగా రెండు వర్గాల మధ్య గొడవ
- మరోసారి కుర్చీలతో కొట్టుకున్న మరో రెండు వర్గాలు


గొడవ పడుతున్నవారిని నిలువరిస్తున్న పోలీసులు

మహానంది: మహానందిలో జరిగిన బహిరంగ వేలాల్లో ఉద్రిక్తత చోటు చేసుకుంది. రెండు వర్గాల మధ్య వాగ్వాదంతో పాటు మరో రెండు వర్గాల మధ్య ముదిరిన వివాదం కాస్త కుర్చీలతో కొట్టుకునే వరకు వెళ్లింది. మహానందిలోని బీఎస్‌ఎన్‌ఎల్ టవర్ నుంచి కరివేన సత్రం వరకు, టీటీడీ కల్యాణ మండపం కాంపౌండ్ ముందు భాగంలో ఉన్న ఖాళీ స్థలాల్లో షాపులు నిర్వహించుకునేందుకు శనివారం ఈఓ నల్లకాలువ శ్రీనివాసరెడ్డి ఆధ్వర్యంలో స్థానిక పోచా బ్రహ్మానందరెడ్డి డార్మెటరీ భవనంలో బహిరంగ వేలాలు నిర్వహించారు. ముందుగా కొబ్బరిచిప్పల సేకరణ, పాదరక్షలు భద్రపరుచుకునే అంశాలకు సీల్డు, బహిరంగ వేలాలు జరిగాయి. అనంతరం ఆలయ ప్రాంగణంలో ఉన్న సుమారు 50కి పైగా ఖాళీ స్థలాల్లో షాపులు పెట్టుకునేందుకు మొదలయ్యాయి. ప్రస్తుతం షాపులు నిర్వహించుకుంటూ జీవనోపాధి పొందుతున్న వారు నెలకు ఇచ్చే అద్దెలకు కొంత మొత్తం పెంచి దేవస్థానానికి చెల్లిస్తే ఎవరి షాపులు వారే నిర్వహించుకునేలా నిర్ణయించారు. కానీ అలా గాకుండా కొందరు కావాలనే పోటీకి వెళ్లడంతో వ్యాపారుల మధ్య వివాదం మొదలైంది. మొదటగా జరిగిన వేలాల్లో డిపాజిట్లు కట్టి వేలాలకు వచ్చిన అనిమెల శివయ్య, దేవేంద్ర మరి కొందరి మధ్య వివాదం మొదలు కావడంతో పోలీసులు వారిని వారించారు. ఇదిలా ఉండగా టీటీడీ కల్యాణ మండపం వద్ద 43వ నంబరు ప్లాటు(ఖాళీ స్థలం)ను ముందుగా గిరిజన యువకుడికి అనుకున్నారు.. కానీ ఓ వర్గం పోటీకి రావడంతో వివాదం మొదలై కుర్చీలతో కొట్టుకునే వరకు వెళ్లింది. మహానందికి చెందిన భూమా సుబ్బరామయ్య, సోదరులు, మరో వర్గం భవనాశి రమణయ్యల మధ్య గొడవ జరిగింది. ఎస్‌ఐ రామ్మోహన్‌రెడ్డి అక్కడకు చేరుకుని ఇరువర్గాల మధ్య వివాదాన్ని సద్దుమణిగించడంతో పరిస్థితులు అదుపులోకి వచ్చాయి.

వేలం ద్వారా రూ.27.49 లక్షలు ఆదాయం

కొబ్బరిచిప్పలు ప్రోగు చేసుకునే హక్కును రూ.18,09,999కు మహానందికి చెందిన రాజ లింగేశ్వరయ్య దక్కించుకున్నారు. బీఎస్‌ఎన్‌ఎల్ టవర్ సమీపంలో ఉన్న మరుగుదొడ్ల నిర్వహణ హక్కును రూ.9,40,000కు మహేష్ పొందారు. ఈ రెండికి రూ.27.49లక్షల ఆదాయం వచ్చిందని స్థలాల్లో షాపుల నిర్వహణ ద్వారా మరికొంత ఆదాయం వచ్చిందని ఈఓ తెలిపారు.

తాగునీటి సమస్యలు తలెత్తకుండా చర్యలు తీసుకోండి

- ఎంపీపీ వెంకటేశ్వరమ్మ



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ వెంకటేశ్వరమ్మ

నందికొట్కూరు: వేసవిలో తాగునీటి సమస్య తలెత్తకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని ఎంపీపీ వెంకటేశ్వరమ్మ సూచించారు. శనివారం మిడుతూరు మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం జరిరిగింది. ముందుగా అధికారులు తమ ప్రగతి నివేదికలను చదివి వినిపించారు. అనంతరం పలువురు సభ్యులు మాట్లాడుతూ నీటి సమస్య రాకుండా చర్యలు తీసుకోవాలని, జలకనూర్‌లో నిలిచిపోయిన అంగన్‌వాడీ కేంద్ర నిర్మాణం పూర్తి చేయాలని కోరారు. అనంతరం ఎంపీపీ మాట్లాడుతూ ప్రజలకు మంచినీటి సమస్య రాకుండా జాగ్రత్తలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. సిమెంట్ రోడ్ల నిర్మాణాలకు ప్రతిపాదనలు పంపాలని సర్పంచులకు సూచించారు. సమావేశంలో ఎంపీడీఓ దశరథరామయ్య, తహసీల్దార్ శ్రీనివాసులు, ఎంఈఓ ఫైజున్నీసాబేగం, ఈఓఆర్డీ సంజన్న, ఏఈలు ప్రతాపరెడ్డి. క్రాంతికుమార్, విశ్వనాథ్, ఏపీఎం సుబ్బయ్య పాల్గొన్నారు.

టీడీపీ నేతలు దాడులకు తెగబడుతున్నారు


విలేకరులతో మాట్లాడుతున్న లింగాపురం సర్పంచు నాగార్జున రెడ్డి

కర్నూలు (టౌన్): తమ పార్టీ అధికారంలో ఉందని టీడీపీ నేతలు దాడులకు తెగబడుతున్నారని జూపాడుబంగ్లా మండలం లింగాపురం గ్రామ సర్పంచ్ నాగర్జునరెడ్డి విమర్శించారు. నాలుగు రోజుల క్రితం టీడీపీ వర్గీయుల దాడిలో గాయపడి ఓ ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న ఆయన శనివారం జుపాడుబంగ్లా జెడ్పీటీసీ జగదీశ్వర రెడ్డితో కలిసి విలేకరులతో మాట్లాడారు. లింగాపురం గ్రామ పరిధిలోని భూమి విషయంలో వివాదం ఉందన్నారు. ఈనెల 25వ తేదీన పొలం వద్ద సర్వే చేయిస్తున్న తనతో పాటు తన తండ్రి రాజ్‌కుమార్ రెడ్డిపై జూపాడుబంగ్లాకు చెందిన టీడీపీ నేత జంగాల పెద్దన్న అతని కుటుంబసభ్యులు కర్రెలతో దాడికి పాల్పడ్డారన్నారు. వైఎస్సార్‌సీపీ మద్దతుదారులమనే కారణంతోనే కక్షకట్టి టీడీపీ నాయకులు దాడులు చేసి, కేసులు పెడుతున్నారన్నారు. భూ వివాదాన్ని చట్టబద్ధంగా ఎదుర్కొంటామన్నారు. టీడీపీ నాయకుల ఆక్రమణలు, అరాచకాలకు అధికారులు అడ్డుకట్ట వేయాలన్నారు.

పేలుళ్లతో ఇళ్లకు బీటలు


ఇంటి గోడ పగుళ్లను చూపుతున్న నాయకులు

నందికొట్కూరు: నేషనల్ హైవే, సోలార్ ప్రాజెక్టు నిర్మాణం కోసం చేపడుతున్న పేలుళ్లతో ఇళ్లు దెబ్బతింటునాన్యని సీపీఎం నాయకులు నాగేశ్వరరావు, ఫక్కీర్ సాహెబ్, గోపాలకృష్ణ ఆరోపించారు. పేలుళ్ల వల్ల దెబ్బతిన్న దామగట్ల గ్రామంలోని ఇళ్ల గోడలను శనివారం సీపీఎం నాయకులు పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నిబంధనలకు విరుద్ధంగా పేలుళ్లకు పాల్పడుతున్నా అధికారులు ఎలాంటి చర్యలు తీసుకోకపోవడంలో అంతర్యమేమిటని ప్రశ్నించారు. రెవెన్యూ అధికారులు పరిశీలించి బాధిత కుటుంబాలకు నష్టపరిహారం ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు చిన్న ఏసన్న, ఏసురత్నం, రాజన్న, కిరణ్, సురేష్, పెద్ద మునిస్వామి, భాగ్యమ్మ, మార్తమ్మ పాల్గొన్నారు.

ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘించొద్దు

పగిడ్యాల: ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘించొద్దని ముచ్చుమర్రి ఏఎస్‌ఐలు వెంకటశేషయ్య, సుబ్బారావు వాహనదారులకు సూచించారు. శనివారం వారు పాత ముచ్చుమర్రిలో ఆటో డ్రైవర్లతో సమావేశమై పలు సూచనలు చేశారు. మైనర్లకు వాహనాలు ఇవ్వరాదన్నారు. డ్రైవింగ్‌పై అవగాహన లేని పిల్లలు రోడ్లపైకి వచ్చి ప్రమాదాలు చేస్తే జైలు పాలవుతారని హెచ్చరించారు. ఆటో డ్రైవర్లు, ఫోర్‌వీలర్లు నడిపే డ్రైవర్లు హెవీ వెహికల్ డ్రైవింగ్ లైసెన్స్ కలిగి ఉండాలని, యూనిఫాం ధరించాలని సూచించారు.

ప్రకృతి వ్యవసాయంతో లాభాలు

నందికొట్కూరు: ప్రకృతి వ్యవసాయంతో లాభాలు సాధించవచ్చని వెలుగు జిల్లా సమాఖ్య అధ్యక్షురాలు మార్తమ్మ తెలిపారు. శనివారం ఆత్మ భవనంలో ఏర్పాటు చేసిన ప్రకృతి వ్యవసాయం కన్వెర్జెన్సీ సమావేశంలో ఆమె మాట్లాడారు. భూమిలేని వారు పెరటి తోటలు వేసుకోవచ్చన్నారు. కార్యక్రమంలో ఏపీఎం శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

ఈకేవైసీ గడువు పొడిగించాలి


తహసీల్దార్‌కు వినతి పత్రం అందజేస్తున్న నాయకులు

ఆత్మకూరు: రేషన్‌కార్డులో ఈకేవైసీ గడువును మరో మూడు నెలలు పొడిగించాలని సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు నరసింహ నాయక్, పట్టణ కార్యదర్శి ఎ.రణధీర్, మండల కార్యదర్శి పి.సుధాకర్ ప్రభుత్వాన్ని కోరారు. శనివారం వారు తహసీల్దార్ రత్నరాధికను కలిసి వినతి పత్రం అందజేశారు. పార్టీ నాయకులు రామ్‌నాయక్, షేక్ ఇస్మాయిల్, సురేంద్ర, వీరన్న, చిన్న అంబయ్య, నూర్ అహ్మద్ పాల్గొన్నారు.

జాతరలో ట్రాఫిక్ సమస్య తలెత్తనివ్వం


ఏర్పాటును పర్యవేక్షిస్తున్న సీఐ సుబ్రహ్మణ్యం, డీఈ ధనిబాబు, ఏఈ బషీర్

జూపాడుబంగ్లా: తర్తూరు జాతరలో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా, ట్రాఫిక్ సమస్య తలెత్తనివ్వకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకుంటామని నందికొట్కూరురూరల్ సీఐ సుబ్రహ్మణ్యం తెలిపారు. శనివారం తర్తూరులో జాతర ఏర్పాట్లను పంచాయతీరాజ్‌శాఖ డీఈ ధనిబాబు, ఏఈ బషీర్‌తో కలిసి పరిశీలించారు. హైవే అధికారులతో మాట్లాడి తర్తూరు ఆర్చీ పక్కన రోడ్డును ఏర్పాటుచేసి పొలాల మీదుగా తర్తూరు బైపాస్‌గుండా జాతరలోకి భారీ వాహనాలు వెళ్లేలా రోడ్డు నిర్మాణం చేపట్టనున్నట్లు తెలిపారు. తర్తూరు జాతర నుంచి పాత రోడ్డు వెంట కార్లు, బైక్‌లు వెళ్లేలా చేయడం ద్వారా ఎవరికి ఎలాంటి అంతరాయం ఉండదన్నారు. వారి వెంట పగిడ్యాల ఎస్‌ఐ శరత్‌కుమార్‌రెడ్డి ఉన్నారు.

జగనన్న కాలనీలో సమస్యలు పరిష్కరించాలి

పాములపాడు: మండలంలోని జూటూరు గ్రామ సమీపంలో కేజీ రోడ్డు పక్కన నిర్మించిన జగనన్న కాలనీలో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని సీపీఎం మండల కార్యదర్శి స్వాముస్న కోరారు. శనివారం కాలనీలో ప్రజలతో ఆయన సమావేశమై సమస్యలు తెలుసుకున్నారు. వైఎస్‌ఆర్‌సీపీ ప్రభుత్వ హయాంలో రుద్రవరం, జూటూరు, కోల్స్ ఆనందాపురం, క్రిష్ణారావుపేట, తుమ్మలూరు గ్రామాలకు చెందిన ప్రజలకు 350 మందికి ఇళ్ల స్థలాలు ఇచ్చారన్నారు. ప్రస్తుతం 20 మంది ఇంటి నిర్మాణాలు చేపట్టి నివాసముంటున్నారన్నారు. కాలనీలో మౌలిక వసతులు లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. అధికారులు స్పందించి సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని కోరారు. సీపీఎం నాయకులు మధు పాల్గొన్నారు.

ఆలయ భూములను ఆక్రమిస్తే కఠిన చర్యలు

మహానంది: మహానంది దేవస్థానం పరిధిలోని పెద్ద నంది ఎదురుగా నూతనంగా నిర్మించిన టీటీడీ కల్యాణ మండపం వెనుక వైపు ఉన్న పొలాల్లో రస్తా కోసం ఓ వ్యక్తి కొన్నేళ్లుగా ప్రయత్నం చేస్తున్న విషయం తెలిసిందే. తాజాగా ఆయన బండిఆత్మకూరు మండలానికి చెందిన కొందరిని పంపించి దారి విషయంలో శనివారం మరోసారి వివాదానికి తెరలేపాడు. విషయం తెలుసుకున్న ఈఓ నల్లకాలువ శ్రీనివాసరెడ్డి, సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకుని దేవస్థానం స్థలంలో వేసిన సిమెంట్ దిమ్మెల గుర్తులను తొలగించారు. దేవస్థానం స్థలాన్ని ఆక్రమిస్తే చర్యలు తప్పవని అధికారులు హెచ్చరించారు.

పాఠశాలను కొనసాగించాలి

పగిడ్యాల: మండల పరిధిలోని లక్ష్మాపురం ప్రాథమికోన్నత పాఠశాలను యథాతథంగా కొనసాగించాలని సర్పంచ్ సుజాత ఆధ్వర్యంలో గ్రామస్తులు శనివారం ఎంఈఓ మురళీమోహన్‌రెడ్డిని కలిసి వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో హెచ్‌ఎం వెంకట్రాముడు, ఉపాధ్యాయులు వరలక్ష్మి, ఉపేన్‌రెడ్డి, ఎంపీటీసీ గౌరమ్మ, స్కూల్ కమిటీ చైర్మన్ మద్దమ్మ, వైస్ చైర్మన్ రహంతుల్లా పాల్గొన్నారు.


ఎంఈఓకు వినతి పత్రం అందజేస్తున్న దృశ్యం

అలరించిన సాంస్కృతిక కార్యక్రమాలు


నృత్యం చేస్తున్న బాలికలు

శ్రీశైలంటెంపుల్: ఉగాది మహోత్సవాలను పురస్కరించుకుని శ్రీశైల దేవస్థానం ఆధ్వర్యంలో పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. శనివారం శ్రీశైల జగద్గురు సేవా సమితి ఆధ్వర్యంలో పలు ధార్మిక, సాంస్కృతిక కార్యక్రమాలు, ఆధ్యాత్మిక ప్రవచనాలు, సంప్రదాయ నృత్యం, శివనామ భజన కార్యక్రమాలు నిర్వహించారు. విజయపురకు చెందిన అకాశ్ మంగులి వారి కన్నడ భక్తి రంజని, ప్రసిద్ధ నేపథ్య గాయనీగాయకులచే భక్తి సంగీత విభావరి(కన్నడ), నందికొట్కూర్‌కు చెందిన సాయిలిక్షితాశ్రీ నృత్య కళాశాల వారి కూచిపూడి నృత్యప్రదర్శన, అనంతపురం అద్యలక్ష్మి వారి సంప్రదాయ నృత్యప్రదర్శన, బెంగళూరు డా.ఎం.మోహన్ వారి నృడ భక్తి సంగీత కార్యక్రమాలు అలరించాయి.